సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 28 । జనవరి । 2024



ఆర్‌సీహెచ్‌పీకి 25 ఏళ్లు

రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ 25 ఏళ్లు పూర్తిచేసుకుందని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం శాలేంరాజు తెలిపారు. 8లో



భారీగా గంజాయి పట్టివేత

భద్రాచలం: పాల్వంచ నుంచి భారీగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 35° / 16°

జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మాత్రం చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న మధుసూదన్ రాజు

కొత్తగూడెంఅర్బన్ : జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పర్సన్ ఇన్‌చార్జ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు అన్నారు. గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2024 – 25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో పాటు లైబ్రరీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను తీర్మానించారు. ఈ సందర్భంగా మధుసూదన్ రాజు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి రావాల్సిన సెస్ బకాయిల వివరాలపై నివేదిక అందజేయాలని చెప్పారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ శ్రీనివాస్, డీపీఓ రమాకాంత్, డీఈఓ వెంకటేశ్వరచారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎ.మంజువాణి, ఆఫీస్ ఇన్‌చార్జ్ ఎం.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు



చెక్కు అందజేస్తున్న సుదర్శన్ దంపతులు

చర్ల: చర్ల మండల కేంద్రంలో చేపట్టిన ఏడు దర్వాజల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భద్రాచలంలోని జయభారతి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ జయభారతి దంపతులు రూ. 5లక్షల విరాళాన్ని శనివారం అందజేశారు. ఈ మేరకు వికాస తరంగిణి బాధ్యులు గంజి పురుషోత్తం, అశోక్, మల్లికార్జున్‌కు చెక్కు ఇచ్చారు.

సాహిత్య డాట్‌కామ్ ఆలోచన అభినందనీయం



ఈఓ రమాదేవిని సత్కరిస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్/భద్రాచలంఅర్బన్ : పాఠకుల అభిరుచికి అనుగుణంగా అన్ని రకాల సాహిత్యాన్ని ఒకే వేదికపై అందించే సాహిత్య డాట్ కామ్ ఆలోచన అభినందనీయమని రామాలయ ఈఓ రమాదేవి అన్నారు. సాహిత్య డాట్ కామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కథల పోటీల విజేతలకు శని వారం ఆమె ఆలయ ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని రకాల సాహిత్యాలను డిజిటల్ లైబ్రరిలో పొందుపరచడం హర్షణీయమని అన్నారు. అనంతరం ఈఓను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి రిషి, ఆలయ ఈఈ రవీంద్ర, గుండే వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

4 నుంచి రాష్ట్రస్థాయి సాంస్కృతిక వేడుకలు

భద్రాచలంటౌన్: ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు భద్రాచలం జూనియర్ కళాశాల ఆవరణలో కళాభారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

సుజాతనగర్: సాంకేతిక విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్షలు స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన పరీక్షకు ఉదయం సెషన్‌లో 131 మందికి అందరూ, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 130 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరి 1 వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు రూ.1000 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 5 వరకు ఫీజు చెల్లించొచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించాలని సూచించారు.

ఇక ఐదు రోజులే..

ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల గడువు

- 2 నుంచి ప్రత్యేక పాలనకు రంగం సిద్ధం
- ఆదేశాలు రాకముందే అధికారుల ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామపంచాయతీలు



చుంచుపల్లి తండా గ్రామపంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి/ఇల్లెందురూరల్: గ్రామ పంచాయతీల్లో ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక పాలనకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం శాఖల వారీగా అధికారుల కేటాయింపు, ఏర్పాట్ల వివరాలను జిల్లా పంచాయతీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగిసిన తర్వాత సకాలంలో ఎన్నికలను నిర్వహించాలంటే నెల రోజుల ముందు నుంచే ఆ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఇక ఐదు రోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రత్యేక పాలన వైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. తమకే తిరిగి పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా అవకాశం ఇవ్వాలని ప్రస్తుత సర్పంచ్‌లు కోరుతున్నా, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అది సాధ్యం కానందున ప్రత్యేక పాలన అనివార్యం అవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించేందుకు గత వారం రోజులుగా శాఖల వారీగా ఉద్యోగుల వివరాలను సేకరించారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, సిబ్బంది హోదాల ఆధారంగా ప్రత్యేకాధికారుల జాబితా రూపొందించారు. వారి హోదాను బట్టి ఏయే గ్రామాల బాధ్యతలను కేటాయించాలనే దానిపై జిల్లా పంచాయతీ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించారు.

ఉమ్మడి జిల్లాలో 1,070 పంచాయతీలు..

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 1,070 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఖమ్మంలో 589, భద్రాద్రిలో 481 ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాకముందే జిల్లా పంచాయతీ అధికారులు స్పెషలాఫీసర్ల నియామకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి మండల స్థాయిలో తహసీల్దారు, ఎంపీడీఓ, ఎంపీఓ, జూనియర్ అసిస్టెంట్ స్థాయికి తగ్గకుండా ఉండేవారిని నియమించేలా చర్యలు చేపట్టారు. మేజర్ పంచాయతీలకు గెజిటెడ్, చిన్న పంచాయతీలకు నాన్ గెజిటెడ్ హోదా కలిగిన అధికారులను సర్దుబాటు చేసే వీలుంది. ఇందుకోసం ప్రధానంగా రెవెన్యూ అధికారులు, పంచాయతీ రాజ్ ఏఈలు, డీఈలు, మున్సిపల్ అధికా రులు, అగ్రికల్చర్ ఏఈఓలు, ఇరిగేషన్, మిషన్ భగీరథ, రోడ్లు భవనాలు, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక, విద్యాశాఖ అధికారులు, ఎంపీడీఓ లు, ఎంపీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లకు స్పెషలాఫీసర్లుగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇక గ్రామాల పరిధిలో తాగునీటి సరఫరా, నూతన నిర్మాణాలకు అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, పైపుల లీకేజీలను అరికట్టడం, మోటార్ల మరమ్మతులు, దుకాణాల పన్నుల వసూలు, తాగునీటిలో క్లోరినేషన్, రోడ్లు, కాల్వలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన వస్తే ప్రగతికి ఆటంకం ఏర్పడుతుందనే చర్చ సాగుతోంది. గ్రామాల్లో నీటి పథకాలు మరమ్మతులకు గురైనా, వీధిలైట్లు వెలగకపోయినా ప్రజా అవసరాల దృష్ట్యా ఇప్పటివరకు సర్పంచ్‌లే తమ సొంత డబ్బు వెచ్చించి ఆ తర్వాత ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చినప్పుడు తీసుకునేవారు. ప్రత్యేక పాలనలో అలాంటి స్వేచ్ఛ ఉండనందున నిబంధనల మేరకే పనులు చేపట్టాల్సి ఉంటుంది.

పెండింగ్ బిల్లులపై ఆందోళన..

గతే ఐదేళ్లలో గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కొన్ని సర్పంచ్‌లు చేయగా, మరికొన్ని కాంట్రాక్టర్లు చేశారు. ఇందులో వైకుంఠధామాలు, కంపోస్టు షెడ్‌ల బిల్లులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో మంజూరు కాలేదు. కలెక్టరేట్ ప్రారంభోత్సవ సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీకి రూ.10 లక్షలు స్పెషల్ గ్రాంట్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయా నిధులకు సంబంధించి ఉత్తర్వులు వెలువడకముందే పలు పంచాయతీల్లో సర్పంచ్‌లు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మించారు. వీటితోపాటు గత ప్రభుత్వం ఎన్నికల ముందు పెద్ద మొత్తంలో సీసీ రోడ్ల నిధులు మంజూరు చేసింది. కానీ అవి నేటికీ గ్రామపంచాయతీ ఖాతాల్లో జమ కాలేదు. అంతేకాక గ్రామ పంచాయతీలకు గత మూడేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సక్రమంగా మంజూరు కావడం లేదు. దీంతో సాధారణ పనులు చేపట్టడం కూడా సర్పంచ్‌లకు కష్టంగా మారింది. ఎలాగైనా నిధులు వస్తాయనే నమ్మకంతో అప్పు చేసి పనులు చేపడితే నేడు ఆ బిల్లులు రూ.లక్షల్లో పేరుకుపోయాయి. దాదాపు ప్రతి గ్రామపంచాయతీకి రూ. 2లక్షల నుంచి రూ. 4లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పరిస్థితిలో మరో నాలుగు రోజుల్లో పరిపాలన గడువు ముగుస్తుండడంతో తాము పెట్టిన పెట్టుబడి ఎలా వస్తుందో అనే ఆందోళన సర్పంచ్‌ల్లో వ్యక్తమవుతోంది.

జాబితా సిద్ధం చేస్తున్నాం



గ్రామపంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 2వ తేదీతో ముగుస్తుంది. తర్వాత ఏం చేయాలనే దానిపై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన ఆదేశాలు వెలువడలేదు. గడువు తక్కువగా ఉన్నందున ముందు జాగ్రత్తగా గ్రామపంచాయతీల వారీగా ప్రత్యేక అధికారులను ఎంపిక చేసి, జాబితా సిద్ధం చేసుకుంటున్నాం. – లక్ష్మీరమాకాంత్, డీపీఓ

భద్రగిరికి పోటెత్తిన భక్తులు





భారీగా హాజరైన భక్తులు (ఇన్‌సెట్) నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

- రామనామంతో మార్మోగిన ఆలయం
- స్వామివారిని దర్శించుకున్న పలువురు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ పరిసరాలు రామానామ స్మరణతో మార్మోగాయి. స్వామివారికి నిర్వహించే నిత్య కల్యాణ వేడుకలోనూ రికార్డు స్థాయిలో భక్తులు పాల్గొన్నారు. కాగా, రామయ్య దర్శనానికి కొందరు వీఐపీలు రావడంతో సామాన్య భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. వరుస సెలవులు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంతో పాటు గోదావరి తీరంలోనూ సందడి నెలకొంది. రామయ్య దర్శనానికి ఆలయ అధికారులు సైతం ఊహించని విధంగా భక్తులు తరలిరావడంతో రద్దీని కట్టడి చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. దర్శనానికి సామాన్య భక్తులకు రెండు గంటలు పట్టింది. అయితే కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు వసతి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకోకుండానే వెనుదిరిగారని సమాచారం. భద్రాచలంలో ప్రైవేట్ లాడ్జీలు సైతం ఖాళీ లేకపోవడంతో పాల్వంచ, కొత్తగూడెంలో రాత్రి బస చేసి శనివారం రామయ్య దర్శనానికి వచ్చినట్లు పలువురు భక్తులు తెలిపారు. వరుస సెలవులు రావడంతో చాలామంది భక్తులు మేడారంతో పాటు భద్రాచలం రామయ్య దర్శనానికి తరలివస్తున్నారు. దీతో పుణ్యక్షేత్రాలతో పాటు పాపికొండలు వంటి పర్యాటక కేంద్రాలు సైతం కిక్కిరిసిపోతున్నాయి.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన..

శ్రీసీతారామచంద్ర స్వామివారికి శనివారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రామయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు..

శ్రీ సీతారామచంద్ర స్వామివారిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఈ.వీ. వేణుగోపాల్, కె.శరత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.

బాధ్యతలు చేపట్టిన ‘కొత్వాల’



కొత్వాల శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా కొత్వాల శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. డీసీసీబీ నుంచి తీసుకున్న వాహన రుణాన్ని సకాలంలో చెల్లించకపోవటంతో డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావుపై సహకార చట్టం ఆధారంగా అనర్హత వేటు వేసిన విషయం విదితమే. దీంతో శేషగిరిరావు తల్లాడ మండలం గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గానే కాక డీసీఎంఎస్ చైర్మన్ పదవులు కోల్పోయారు. అనంతరం వైస్‌చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావును చైర్మన్‌గా నియమించగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో డీఐజీ సుమతి



మాట్లాడుతున్న ఎస్ఐబీ డీఐజీ సుమతి, పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

బూర్గంపాడు: రానున్న లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో డీఐజీ సుమతి అన్నారు. సారపాకలోని ఐటీసీ పీఎస్‌పీడీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా పోలీస్ అధికారులతో శనివారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. జిల్లా, రాష్ట్ర సరిహద్దుల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని, నిరంతర తనిఖీలు చేపట్టాలని చెప్పారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో సమన్వయం పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ముందుగా డీఐజీకి ఎస్పీ రోహిత్‌రాజ్ స్వాగతం పలికారు. సమావేశంలో ఎస్‌బీఐ ఎస్పీ రాజేష్, 81 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ మనీష్‌కుమార్ మీనా, 141 సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రితేష్ ఠాకూర్, కొత్తగూడెం ఓఎస్డీ టి. సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, 151 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అయోధ్యసింగ్, డీఎస్పీలు వెంకటేష్, రాఘవేంద్రరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా, డీఐజీ సుమతికి కలెక్టర్ ప్రియాంక ఆల పుష్పగుచ్ఛం అందజేశారు.

బీఆర్ఎస్ దిమ్మతిరిగేలా గ్యారంటీలు

- పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



చింతకాని మండలం చినమండవలో పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

మధిర: బీఆర్ఎస్ నేతలకు దిమ్మ తిరిగేలా త్వరలోనే రెండు గ్యారంటీలను అమలు చేయనున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఖమ్మం జిల్లా మధిర, చింతకాని మండలాల్లో శనివారం పర్యటించిన ఆయన పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో భట్టి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మన్, సభ్యులను నియమించిన నేపథ్యాన ఎన్నికలకు ముందు విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ఆధారంగా ఉద్యోగాల నియామకం పారదర్శకంగా చేపడతామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా.. రాష్ట్రంలో దాదాపు 10 కోట్ల మంది వినియోగించుకున్నారని చెప్పారు. అలాగే, గత పదేళ్లుగా మెరుగైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్న పేదల కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సాయాన్ని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు.

సంపద సృష్టి.. పేదలకు పంపిణీ

రాష్ట్రంలో సంపద సృష్టించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని భట్టి వెల్లడించారు. వ్యవసాయం, నీటిపారుదల, ఐటీ, పారిశ్రామిక రంగాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఇందిరమ్మ రాజ్యంలో పెద్ద పీట వేస్తున్నామని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని గత పాలకుల చేతుల్లో పెడితే అప్పుల పాలు చేశారని, ఆ అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల పన్నులతో వచ్చే ప్రతీ పైసా ప్రజలకే పంచుతామని, ఆరు గ్యారంటీలు తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో మంత్రుల పర్యటనల సందర్భంగా విపక్ష నాయకులను పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించేవారని.. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే వాళ్ళు ఉండాలి, ప్రతిపక్షాలు ఉండాలనే భావనతో తాము అధికారంలోకి రాగానే ధర్నా చౌక్ తెరిపించామని భట్టి వెల్లడించారు.

రాజ్యాంగమే కీలకం

- ప్రతీ ఒక్కరు అందుకు అనుగుణంగా నడవాల్సిందే
- హైకోర్టు జడ్జి వేణుగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి వేణుగోపాల్

కొత్తగూడెంటౌన్ : దేశ రాజ్యాంగం ప్రతీ ఒక్కరికీ కీలకమని, ఎవరైనా దాని ప్రకారం నడుచుకోవాల్సిందేనని హైకోర్టు న్యాయమూర్తి ఏనుగుల వెంకట వేణుగోపాల్ అన్నారు. కొత్తగూడెం జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐక్యరాజ్య సమితిలో మానవ హక్కుల ప్రకటనకు అనుగుణంగా పౌరులకు వ్యక్తిగత స్వేచ్ఛ కల్పిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 నిర్దేశించిందని తెలిపారు. ఈ హక్కును ఎవరూ హరించరాదని అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్‌వసంత్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రపంచలోనే అత్యంత పెద్దదని, దేశ పౌరులకు అనేక హక్కులను కల్పిస్తోందని చెప్పారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామరావు, మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత, ఇల్లెందు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దేవరపల్లి కీర్తిచంద్రికారెడ్డి, పీపీ పోసాని రాధాకృష్ణమూర్తి, ఏజీపీ ఏవూరి బాబూరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి రావి విజయ్‌కుమార్, బార్ అసోసియేసన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో నూతన కోర్టులను ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు న్యాయమూర్తి వెంకటగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, సహాయ కార్యదర్శి కాసాని రమేష్, కోశాధికారి సంతోష్‌లాల్ సాహూ, వై.వై. నాయుడు, పిట్టల రామారావు, జీకే అన్నపూర్ణ, వట్టికొండ సురేష్‌బాబు, రేపాక వెంకటరత్నం పాల్గొన్నారు.

న్యాయమూర్తులతో కలెక్టర్ భేటీ

బూర్గంపాడు: హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఈ.వీ. వేణుగోపాల్, జస్టిస్ కె.శరత్‌తో కలెక్టర్ ప్రియాంక ఆల శనివారం భేటీ అయ్యారు. భద్రాచలం పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన న్యాయమూర్తులకు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్ వద్ద కలెక్టర్ స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులతో భేటీ అయి జిల్లాలోని పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది.



హైకోర్టు న్యాయమూర్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

హైకోర్టు జడ్జికి సన్మానం

హైకోర్టు జడ్జి వేణుగోపాల్‌ను న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు శ్రీనివాసరాజు, రామిశెట్టి రమేష్, ఉద్యోగులు నిమ్మల మల్లికార్జున్, వాసం రమేష్, రవికుమార్, రామకృష్ణతో పాటు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సన్మానించారు.

నేడు సింగరేణి సీఎంఓఏఐ ఎన్నికలు

- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 7 గంటల నుంచి ఎక్కడికక్కడే లెక్కింపు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 2, 208 మంది అధికారులు



ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) సింగరేణి బ్రాంచ్ ఎన్నికలు ఆదివారం జరుగనున్నాయి. ఉదయం 9 గంటలకు మొదలయ్యే పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత 7 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తారు. సింగరేణి భవన్‌తో కలిపి 12 ఏరియాల కమిటీలతో పాటు, సింగరేణి బ్రాంచ్ కమిటీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలకు ఆయా ఏరియాల జీఎంలు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. మొత్తం 2,208 మంది అధికారులు ఓటు హక్కు వినియోగించుకోనుండగా, కొత్తగూడెం ఏరియాలో 169 మంది అధికారులు ఉన్నారు. కొత్తగూడెం ఏరియాలో పోలింగ్ కోసం ఆర్‌సీహెచ్‌పీలో ఏర్పాట్లు చేయగా, జీఎం శాలెంరాజు శనివారం పరిశీలించారు.

ఒక్కొక్కరు రెండు ఓట్లు..

సింగరేణి ఏరియా కమిటీలో 8 ఏరియా అధ్యక్ష పోస్టులు, వైస్ ప్రసిడెంట్లు రెండు, సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ పోస్టులు రెండు, కోశాధికారి, సహాయ కోశాధికారి పోస్టులు ఉంటాయి. బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ కమిటీలోఅధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి, సహాయ కోశాధికారి పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి. అయితే ఒక్కో అధికారి ఏరియా కమిటీకి ఒక ఓటు, బ్రాంచ్ కమిటీకి ఒక ఓటు.. మొత్తం రెండు ఓట్లు వేయాల్సి ఉంటుంది.

అధ్యక్ష పదవికి ఆరుగురు పోటీ..

కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ అధ్యక్ష పదవికి ఆరుగురు అభ్యర్థులు పోటీ పడుతుండగా, రెండు ఉపాధ్యక్ష పదవులకు 10 మంది బరిలో నిలిచారు. ప్రధాన కార్యదర్శి పదవికి నలుగురు, కోశాధికారి పోస్టుకు ఇద్దరు, రెండు సహాయ కోశాధికారి పదవులకు 14 మంది పోటీ చేస్తున్నారు. అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న వారిలో పొలడుగు శ్రీనివాస్, ఎస్.రాధాకృష్ణ, గడిపెల్లి కృష్ణప్రసాద్, గోపాల్‌సింగ్, అనుముల వెంకటేశ్వరరెడ్డి, తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ ఉన్నారు.

క్లుప్తంగా

జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని కమ్మ ఫంక్షన్ హాల్‌లో జోయాలుక్కాస్ జ్యుయెలరీ ఎగ్జిబిషన్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్యుయెలరీ ప్రియుల కోసం జోయాలుక్కాస్ నిర్వాహకులు మూడు రోజుల పాటు సేల్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వాసులు గతంలో బంగారు నగల కొనుగోలుకు ఖమ్మం, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, దీంతో అదనపు ఖర్చులయ్యేవని, ఇప్పుడు ఇక్కడే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి, సర్పంచ్ బాదావత్ సుగుణ, జోయాలుక్కాస్ జ్యుయెలరీ ఎగ్జిబిషన్ రీజినల్ మేనేజర్ రాబిన్ తంఫి, ఖమ్మం బ్రాంచ్ ఇన్‌చార్జ్ మణికందన్ తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల్లో తేడా వస్తే చర్యలు


విక్రయదారులకు అవగాహన కల్పిస్తున్న తూనికలు, కొలతల అధికారి మనోహర్

టేకులపల్లి: వివిధ రకాల వస్తువుల విక్రయాల్లో తూనికలు, కొలతల్లో తేడా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి మనోహర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని వారాంతపు సంతలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. సంతంలో ప్రతి షాపునకు వెళ్లి తూనికలను పరిశీలించారు. వస్తువులను కొలిచే బాట్లకు స్టాంపింగ్ ఉన్నదీ లేనిదీ, ఎవరైనా రాళ్లు వాడుతున్నారా? అని అని క్షుణ్ణంగా పరిశీలించారు. తరువాత చికెన్ షాపులు, పత్తి కొంటర్లు, ఇతర దుకాణాల్లోనూ తనిఖీలు చేపట్టారు. వినియోగదారులు వస్తువు కొనుగోలులో తూకాన్ని పరిశీలించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. వ్యాపారులు ఉపయోగించే తూనికలు, కొలతల పరికరాలను సకాలంలో ముద్ర వేయించుకొని లైసెన్స్ తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా, మండలంలో పత్తి, చికెన్ దుకాణాలపై 11 కేసులు నమోదు చేసి, రూ.40 వేలు రుసుం విధించారు.

సీఎం కార్యాలయ ఆదేశాలతో సర్వే


గ్రామంలో సర్వే చేస్తున్న అధికారులు

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామ శివారు గొత్తికోయగూడెం మంగళిబోడులో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. మంగళిబోడుకు చెందిన గొత్తికోయలు ఇటీవలె సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజావాణిలో తమకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందించారు. దీంతో సీఎం పేషీ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాల మేరకు అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సర్వే చేపట్టారు. తాగునీరు, విద్యుత్, రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేయాలని గొత్తికోయలు విన్నవించారు. సదుపాయల కల్పన, అవకాశాలపై అధికారులు పరిశీలించారు. గొత్తికోయగూడెంలో మొత్తం 23 కుటుంబాలుండగా 126 మంది జనాభా ఉన్నారు. అందులో 60 మంది పిల్లలు ఉన్నారు. ఈ సర్వేలో సర్వేయర్ ధర్మరాజు, ఏఎస్‌ఓ పూర్ణిమ, ఆర్‌ఐ అక్బర్, ఫారెస్టు బీట్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు. సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తహసీల్దార్ సాధియా సుల్తాన తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దమ్మపేట: మద్యం మత్తులో పురుగులమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ముకుందాపురం గ్రామానికి సంగం ఉదయగిరి (43) లారీక్లీనర్‌గా పనిచేస్తున్నాడు. తరచూ మద్యం సేవిస్తూ అప్పుడప్పుడూ లారీవెంట వెళ్లేవాడు. శుక్రవారం మద్యం తాగడానికి డబ్బులు కావాలని తల్లిని అడిగితే ఆమె లేవని చెప్పింది. క్షణికావేశంలో పురుగులమందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లికి తరలించారు. అనంతరం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు నరసయ్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

రంగు మారింది..


ఖమ్మంలోని ఓ రేడియం షాపు వద్ద అంబులెన్స్‌లు


వాహనంపై గులాబీ రంగు స్టిక్కర్లు తొలగిస్తున్న దృశ్యం

రాష్ట్రంలో ఇటీవల కొత్త ప్రభుత్వం కొలువుదీరగా.. పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందులో భాగంగానే 108 అంబులెన్స్‌ల రంగులను సైతం మారుస్తున్నారు. అంబులెన్స్‌లపై గులాబీ రంగు స్టిక్కర్లు ఉండగా వాటిని తొలగించి తెల్ల రంగు వేయిస్తున్నారు. అలాగే, గత సీఎం కేసీఆర్ చిత్రాలను తొలగించారు. ఈ మేరకు ఖమ్మంలోని ఓ రేడియం షాపు వద్ద శనివారం అంబులెన్స్‌లు బారులుదీరి కనిపించాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

రెస్టారెంట్ అగ్రిమెంట్ విషయంలో వివాదం

- ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు
- సర్దిచెప్పిన పోలీసులు


నిరసన తెలుపుతున్న కొండారెడ్డి కుటుంబ సభ్యులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న రమ్యశ్రీ రెస్టారెంట్ అగ్రిమెంట్ విషయంలో స్థలం యజమాని, లీజుదారుడి మధ్య వివాదం జరగడంతో శనివారం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి.. కరోనా సమయంలో వచ్చిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా లీజు గడువు పెంచాలని కొంతకాలంగా అడుగుతున్నామని, ఈ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాకముందే శుక్రవారం అర్ధరాత్రి సమయంలో స్థలం యజమానికి సంబంధించిన పలువురు వ్యక్తులు అధిక సంఖ్యలో వచ్చి రెస్టారెంట్‌కు వేసిన తాళాలు పగలగొట్టి, రెస్టారెంట్ లోపలికి చొరబడి వస్తువులను చెల్లాచెదురు చేశారని లీజుదారుడు కొండారెడ్డి తెలిపారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి రెస్టారెంట్ ఎదుట నిరసన చేపట్టారు. కాగా, స్థలం యజమాని నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 2017లో రెస్టారెంట్ నడుపుకోవడానికి మూడేళ్లకు అగ్రిమెంట్ రాసుకున్నామని, మళ్లీ అదే అగ్రిమెంట్ మరో ఏడాదికి పెరిగిందని, ఈలోపు కరోనా వచ్చిందన్నారు. అగ్రిమెంట్‌ను పెంచాలని పలుమార్లు రెస్టారెంట్ నిర్వాహకుడు కొండారెడ్డి అడుగుతున్నాడని, కుదరదని చెప్పినప్పటికీ వినడం లేదని, ఏడాదిన్నర నుంచి స్థలాన్ని ఖాళీ చేయాలని చెబుతున్నానని చెప్పారు. ఇదే విషయంపై పెద్ద మనుషుల వద్ద అనేకసార్లు పంచాయితీ జరిగినా లీజుదారుడి నుంచి సరైన సమాధానం రాలేదని, దీనికి తోడు ఇవ్వాల్సిన రెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, లీజుదారుడు తన వద్ద కొంత నగదును అప్పుగా తీసుకుని అది కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. కాగా, శనివారం ఉదయం నుంచి జరుగుతున్న వివాదం సాయంత్రానికి తీవ్రరూపం దాల్చడంతో సీఐ నాగరాజురెడ్డి వచ్చి.. సమస్య పరిష్కారమయ్యేవరకు ఇరువర్గాలు ఈ స్థలం వద్దకు రావొద్దని సర్దిచెప్పి పంపించారు.

రెస్టారెంట్‌పై దాడి.. కేసు నమోదు

తమ రెస్టారెంట్‌పై శుక్రవారం రాత్రి సమయంలో పలువురు దుండగులు దాడి చేశారని యజమాని దుగ్గిరెడ్డి రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. చల్లగుళ్ల నాగేశ్వరరావు, కృష్ణప్రసాద్, కనకమేడల హరిప్రసాద్, వల్లభనేని చందు, పాటి చలపతి, కృష్ణదొర, ముప్వా రాముతో పాటు మరికొందరు కలిసి రెస్టారెండ్‌లోకి చొరబడ్డారని, అక్కడి వస్తువులను చెల్లాచెదురు చేశారని, సిబ్బందిపై మారణాయుధాలతో దాడి చేసేందుకు యత్నించారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నారు.

అటవీ అధికారులకు సైబీరియన్ కొంగ అప్పగింత


సైబీరియన్ కొంగను అటవీశాఖ ఉద్యోగులకు అప్పగిస్తున్న సభ్యులు

జూలూరుపాడు: అనారోగ్యంతో ఎగరలేని పరిస్థితుల్లో ఉన్న సైబీరియన్ కొంగను స్థానికులు గుర్తించగా.. అటవీశాఖ అధికారులు చికిత్స చేయించారు. జూలూరుపాడు మండలానికి చెందిన పలువురు శనివారం ఉదయం వాకింగ్ చేస్తుండగా కొంగ గాయాలతో కన్పించింది. దీంతో అటవీశాఖ కార్యాలయంలో అప్పగించడంతో ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు తదితరులు పరిశీలించి సైబీరియన్ జాతి కొంగగా నిర్ధారించారు. ఆ కొంగ కుడికాలికి గాయం కావడంతో నిలబడలేకపోతుండటంతో పాపకొల్లు జూనియర్ వెట ర్నరీ ఆఫీసర్ రాజేశ్ ఆధ్వర్యాన చికిత్స చేయించారు. అది కోలుకున్నాక సురక్షితమైన ప్రదేశంలో వదలనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు గడిదేశి ప్రేమ్‌కుమార్, ఎస్‌కే రఫీ, ఎస్‌కే నాగు లు, ఇడుపుల రాజు, నరేశ్, బోస్, నాగరాజు, మణికంఠను ఎఫ్‌ఆర్‌ఓ అభినందించగా డీఆర్‌ఓలు ధనలక్ష్మి, లక్ష్మీనర్సు, ఉద్యోగులు బి.నరసింహారావు, కిషన్, సైదులు పాల్గొన్నారు.

ఆ కౌన్సిలర్‌పై బిగుస్తున్న ఉచ్చు?

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాసం అంశంలో కొందరికి ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షంలో ఉన్న వారే అధికార పార్టీని భయపెట్టే ప్రయత్నం చేస్తే అధికార పార్టీ వదిలేస్తుందా..? అనే చర్చ జోరుగా సాగుతోంది. ఈ అవిశ్వాసం అంశాన్ని నడిపిస్తున్న సదరు కౌన్సిలర్ చుట్టూ వల వేసినట్లు విశ్వసనీయ సమాచారం. మున్సిపల్ చైర్మన్ సీటు మీద కన్నేసిన ఆ కౌన్సిలర్ ఒకవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం, మరోవైపు మద్యం సిండికేట్‌తో పాటు 15 ఎకరాల వరకు ఫారెస్టు భూమి కలిగి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల కిందట ఫారెస్టు అధికారులు నోటీసులు జారీ చేయగా.. శనివారం రెవెన్యూ శాఖాధికారులు సర్వే నిర్వహించినట్లు తెలిసింది. ఏకకాలంలో ఊపిరిసలపకుండా ఉచ్చు బిగించాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఇక క్యాంపు ఉన్న ప్రదేశం, క్యాంపులో ప్రతిరోజూ వారి కార్యకలాపాలు, ఎవరెవరితో టచ్‌లో ఉన్న విషయాలను నిఘా విభాగం ద్వారా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

కేసు నమోదు


కంటి గాయం చూపుతున్న మధువన్‌రెడ్డి

భద్రాచలంఅర్బన్: రెస్టారెంట్ యజమానిపై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలో గీతాంజలి హోటల్‌లో శనివారం హోటల్ అసోసియేషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో హోటల్ నిర్వాహకుడు బొల్లిశెట్టి రంగారావు మధువన్ రెస్టారెంట్ యజమాని మధువన్‌రెడ్డిపై దాడి చేశాడు. దీంతో మధువన్‌రెడ్డి కుడి కంటికి గాయమైందని శనివారం ఫిర్యాదు చేయగా సీఐ నాగరాజురెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన దండాబత్తుల కాంతారావు (39) తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం భద్రాచలం మార్గంలోని రెండో కిలోమీటర్ సమీపంలో పురుగులమందు తాగి అపస్మారకస్థితిలో ఉన్నాడు. అటువైపుగా వెళ్లిన కొందరు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

'కానిస్టేబుల్ కుటుంబం నుంచి ప్రాణహాని ఉంది'

నేలకొండపల్లి: ఓ కానిస్టేబుల్ కుటుంబీకులు భూమి కబ్జాకు యత్నించడమే కాక తమను చంపుతామని బెదిరిస్తున్నారంటూ నేలకొండపల్లి మండలంలోని చెన్నారానికి చెందిన నల్లమల్ల రామారావు ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన తమను కాపాడాలంటూ మంత్రులు, పోలీస్ అధికారులను కోరుతూ శనివారం విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. రైతు కుటుంబానికి చెందిన తమ భూమి ఆక్రమణకు అదే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కుటుంబం యత్ని స్తోందని ఆరోపించారు. ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన తమపై దాడికి యత్నించడమే కాక చంపుతామని బెదిరించారని వాపోయాడు. తమ కుటుంబానికి హానీ ఉన్నందున మంత్రులు, పోలీసు అధికారులు స్పందించి న్యాయం చేయాలని రామారావు కోరాడు.

కలుషిత ఆహారంతో ఏడుగురికి అస్వస్థత


ఇల్లెందు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఇల్లెందురూరల్: మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీ ఎల్లాపురం శివారు రామవరం గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు కలుషిత ఆహారం కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితుల కథనం ప్రకారం.. కుటుంబంలో ఒకరు మృతి చెందటంతో కర్మలు ముగించుకొని ఇంటి వద్ద ఉన్న కుటుంబ సభ్యులు నిద్ర కోసం టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో కుటుంబంలోని మూతి రమేశ్, జంపాల, శైలజ, పార్వతి, అమ్మక్క, సంజు, ప్రణయ్‌కి విరేచనాలు ప్రారంభం కావడంతో శుక్రవారం రాత్రి బంధువుల ఇంటికి వెళ్లారు. కానీ, అక్కడ ఆహారం తీసుకోకుండా శనివారం ఉదయం నేరుగా కొమరారం ఆస్పత్రికి చేరుకున్నారు. పరీక్షించిన వైద్యులు ఇల్లెందు ఆస్పత్రికి సిఫారసు చేశారు. ఇల్లెందులో వైద్యులు పరీక్షించి ఆహారం కలుషితం కావడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని తెలిపారు. కాగా, మూడు రోజుల కిందట చికెన్‌తో భోజనం చేశామని, మిగతా రెండు రోజులు ఆకుకూరలతో మాత్రమే భోజనం చేశామని బాధితులు వైద్యులకు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు సిఫారసు చేశారు. బాధితుల్లో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు.

ఫోన్ కోసం వెళ్తూ రోడ్డుప్రమాదంలో మృతి


రాము (ఫైల్)

సత్తుపల్లిటౌన్: మరిచిపోయిన ఫోన్ తీసుకునేందుకు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఇది. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. బుగ్గపాడుకు చెందిన సవలం రాము(18) తల్లిదండ్రులతో కలిసి నల్లివారిగూడెంలో ఎరువు తోలకం పనులకు వెళ్లాడు. అక్కడ ట్రాక్టర్‌లో తన ఫోన్ మర్చిపోవడంతో స్నేహితుడైన ఏసుబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నాగుపల్లి వైపు నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా రాము మృతి చెందాడు. ఇదేఘటనలో ఏసుబాబుకు సైతం తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

50 కేజీల గంజాయి పట్టివేత


గంజాయి, నిందితులను చూపిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కూనవరంరోడ్డులో శనివారం కారులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో ఓ కారు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేశారు. అందులో గంజాయి లభించడంతో రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. రూ.12.50 లక్షల విలువైన 50 కేజీల గంజాయిని ఒడిశాలో కొనుగోలు చేసి తరలిస్తున్నారని అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు తెలిపారు. కారును స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని వారు చెప్పారు.

పాల్వంచలో రూ.3.25లక్షల విలువైన..

పాల్వంచరూరల్: గుట్టుగా వాహనాల్లో తరలిస్తున్న రూ.3.25 లక్షల విలువ గల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. సీఐ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని పెద్దమ్మగుడి సమీపంలో బీసీయం జాతీయ రహదారిపై శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద రూ.3.25 లక్షల విలువ గల 13 కేజీల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్న నిందితులు వెంకటసాయి, అనూప్‌కుమార్ రెడ్డిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సీఐ వివరించారు. తనిఖీల్లో ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది రామకృష్ణగౌడ్, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్ పాల్గొన్నారు.

అబ్రకం పేపర్‌పై బాలరాముడి చిత్రం


అబ్రకం పేపర్‌పై గీసిన బాలరాముడి చిత్రం

కొత్తగూడెంరూరల్: ఇటీవల అయోధ్యలో ప్రతిష్ఠించిన బాలరాముడి విగ్రహాన్ని భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన సోము చంద్ర మోహన్‌చారి అబ్రకం పేపర్‌పై చిత్రీకరించారు. అయోధ్యలో అరుణ్‌యోగి చెక్కిన శిల్పం రూపురేఖలు ఏ మాత్రం కోల్పోకుండా చిత్రీకరించిన ఆయన పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. గతంలోనూ గాయత్రీదేవి, లక్ష్మీనర్సింహస్వామి, ఏసు ప్రభువు చిత్రాలను గీసిన ఆయన కోడి గుడ్డుపై సైతం బొమ్మలు చిత్రించి అనేక అవార్డులు అందుకున్నారు. అలాగే, సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రాలను అబ్రకం పేపర్‌పై గీసిన చంద్రమోహన్‌చారి వారికి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

సింధు మృతికి కారకులను శిక్షించాలి

- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని డిమాండ్


సింధు భర్త వీరేంద్రనాథ్‌ను ఓదారుస్తున్న ఎమ్మెల్యే

సుజాతనగర్: మాతా శిశు కేంద్రంలో ఈ నెల 24న నవజాత శిశువుతోపాటు తల్లి సింధు మృతికి కారకులైన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. నాయకులగూడెం గ్రామానికి చెందిన మృతురాలు చింతాల సింధు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శనివారం పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వ వైద్యశాలలో భద్రత, భరోసా కల్పించడంలో వైద్య సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఈ ఘటన ప్రభుత్వ వైద్యంపై అపనమ్మకాలను పెంచే ప్రమాదం ఉందన్నారు. సింధు మృతికి కారకులైన వైద్యులు, సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు ఫోన్‌లో తెలిపారు. మాతా శిశు కేంద్రంలో జరిగిన ఘటనను పైస్థాయి అధికారులకు తెలియజేసినా స్పందించకపోవడం తగదని పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ తనతో స్వయంగా అబద్ధాలు చెప్పారంటూ సూపరింటెండెంట్ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నవజాత శిశువుతో పాటు, బాలింత మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, మృతురాలి కుటుంబీకులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషి యా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి లేఖ రాయనున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, నాయకులు జక్కుల రాములు, కొమారి హనుమంతరావు, కొమారి కృష్ణ, మండె నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

25 ఏళ్లు పూర్తి చేసుకున్న ఆర్‌సీహెచ్‌పీ


సీనియర్ కార్మికులతో జీఎం, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) పాతికేళ్లు పూర్తిచేసుకుందని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు తెలిపారు. శనివారం ఆయన ప్లాంట్‌ను సందర్శించి మాట్లాడారు. 1999లో ఆనాటి జీఎం ఎస్‌కే గార్గ్ రోజుకు 16 వేల టన్నుల బొగ్గు రవాణా చేసే జీఎల్ బంకర్ ప్రారంభించారని తెలిపారు. ఆనాటి సీహెచ్‌పీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతూ.. ప్రస్తుతం అత్యాధునిక యంత్రాలతో ఏటా 4.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోందని చెప్పారు. ఇక్కడ 2019లో రూ.5 కోట్లతో ప్రీవేబిన్ ఏర్పాటు చేశామని, సుమారు పదిరెట్లు ఆదాయం తెచ్చిపెట్టిందని వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం సీనియర్ కార్మికులను సన్మానించారు. మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ దుర్గాప్రసాద్, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ కరీముల్లా, విశ్వేశ్వరరావు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని గాండ్లగూడెం సమీపంలో గల వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా, అశ్వారావుపేట గ్రామ శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక రవాణాకు అనుమతులు లేకపోవడంతో పట్టుబడిన రెండు ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు అప్పగించినట్లు చెప్పారు.